సమావేశంలో మాట్లాడుతున్న దేవని కుమార్‌మాదిగ

లడాయిపెడుతున్న మందకృష్ణ మాదిగ

కొల్లాపూర్, ఏప్రిల్ 12: మాదిగ, మాలల మధ్య మందకృష్ణమాదిగ లడాయిపెడుతున్నాడని తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్‌మాదిగ విమర్శించారు.శుక్రవారం ఆయన సంఘం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ మందకృష్ణమాదిగకు ఎన్నికలప్పుడే మాదిగలపై ఎనలేని ప్రేమ పుట్టుకొస్తుందని ఎద్దేవా చేశారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి ఓటువేయమని ఆయన మాదిగ సామాజిక వర్గాన్ని కోరుతున్నారన్నారు. 30 ఏండ్ల క్రితం ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని ప్రారంభించిన ఆయన ఇప్పటివరకు ఎన్నో పార్టీలకు మద్దతుఇచ్చారని గుర్తు చేశారు. పీఎం నరేంద్రమోదీ, కేంద్రమంత్రులు ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా ఉంటే మాల మహానాడు జాతీయ అధ్యక్షు డు చెన్నయ్య వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేశారని గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నిక ల్లో మా దిగ అభ్యర్థులకు టికెట్ ఇవ్వని కాం గ్రెస్ పార్టీకి, ఎస్సీ వర్గీకరణ పేరుతో కాలయాప న చేస్తున్న బీజేపీకి మాదిగలు ఓట్లు వేయకుండా నాగర్‌కర్నూల్ ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే పార్లమెంట్‌లో మన సమస్యలపై గళం విప్పుతారన్నారు. అటు మందకృష్ణ, ఇటు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య మాటలను నమ్మొద్దని ఆయన దళిత ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే దేశం అధోగతే..

పొల్కంపల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ రాములు

- ఎంపీ పోతుగంటి రాములు

వంగూరు, ఏప్రిల్ 12 : ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే దేశం అధోగతి పాలవుతుందని ఎంపీ రాములు పేర్కొన్నారు. మండలంలోని పొల్కంపల్లిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రూ.1,300 కోట్లతో కల్వకుర్తి మీదుగా కొల్లాపూర్, సోమశిల ద్వారా రాయలసీమలో కలిసి తిరుపతి వెళ్లే రహదారి మంజూరు చేయించినట్లు ఎంపీ తెలిపారు. గద్వాల-మాచర్ల రైల్వే లైన్ కోసం కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. కేంద్రంలో బీజేపీ సర్కార్ వస్తేనే దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. సమావేశంలో నాయకులు కొండల్‌రెడ్డి, నారాయణ్‌రావు, సాయన్న, అంజన్‌రెడ్డి, సురేష్‌యాదవ్‌తో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గ్రామ ఐక్య సహకారసంఘం సభ్యులు

కొల్లాపూర్, ఏప్రిల్ 12: మండలంలోని మొలచింతపల్లి, నార్లాపూర్, మాచినేనిపల్లి, జావాయిపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయా గ్రామ ఐక్య సహకార సంఘం సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎం తిరుపతయ్య మాట్లాడుతూ గ్రేడ్-1 వరిధాన్యం క్వింటాలు రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ధాన్యం కొనుగోలు కమిటీ సభ్యులు హైమావతి, లక్ష్మి, అలివేలమ్మ, నిరంజనమ్మ పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన

ఉపాధి కూలీలకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న కళాబృందం సభ్యులు

అచ్చంపేటరూరల్, ఏప్రిల్ 12: మండలంలోని గుంపన్‌పల్లిలో శుక్రవారం ఉపాధి హామీ కూలీలకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాజాతబృందం ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఆవశ్యకతను కూలీలకు అవగాహన కల్పించారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్ పత్యానాయక్ మాట్లాడుతూ 18 ఏండ్లు నిండిన యువతీ, యువకులు ప్రతిఒక్కరూ ఈనెల15వ తేదీ వరకు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- కలెక్టర్ ఉదయ్‌కుమార్
- చెంచుపెంటల్లోని పోలింగ్ కేంద్రాల పరిశీలన
- ఓటర్లకు ఇబ్బందులు కలగొద్దు

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 12: త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని లింగాల, అమ్రాబాద్ మండలాల్లోని ఫరహాబాద్, కుడిచింతలబయలు, సార్లపల్లి చెంచుపెంటల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి వసతి, ఫర్నీచర్, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. చెంచుపెంటల్లో గత అసెంబ్లీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లోనే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులను కల్పించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట స్థానిక రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

భూ ఆక్రమణకు యత్నం?

- న్యాయం చేయాలని బాధితుల డిమాండ్
- చర్యలు తీసుకుంటాం : తాసీల్దార్

టంగాపూర్ కాలనీలో ప్లాట్ల ఎదుట న్యాయం చేయాలని ఆందోళన చేస్తున్న బాధితులు

అచ్చంపేటరూరల్, ఏప్రిల్ 12: గతంలో విక్రయించిన భూమిని రియల్ వ్యాపారులు తిరిగి ఆక్రమించుకున్న ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం అచ్చంపేట పట్టణంలోని టంగాపూర్ కాలనీలోని 26, 27 సర్వే నెంబర్లలోని భూమిని ప్లాట్లుగా చేసి 2009లో భూ యాజమాని ఎల్లికంటి లింగయ్య 59 మందికి విక్రయించి పట్టా చేసి ఇచ్చాడు. తిరిగి అదే భూమిని 4సంవత్సరాల క్రితం భూ యాజమాని లింగయ్య వేరే వారికి రిజిస్ట్రేషన్ చేశాడు. వారు ఇటీవల ధరణిలో పట్టాదారు పాసు పుస్తకాలు పొందారు. దీంతో వారు ప్లాట్లలోని గుడిసెలు, బేస్మెంట్‌లను జేసీబీలతో తొలగించడంతో గతంలో ప్లాట్లు కొన్నవారు శుక్రవారం ఆందోళనకు దిగారు. 26,27 సర్వే నెంబర్‌లో రూ.3 నుంచి రూ.4లక్షలు పెట్టి ప్లాట్ల కొనుగోలు చేసి

గ్రామ పంచాయతీ నుంచి అనుమతులు కూడా తీసుకున్నామని బాధితులు తెలిపారు. భూ యాజమాని ఎల్లికంటి లింగయ్య రెవెన్యూ అధికారులతో కలిసి తమకు విక్రయించిన భూమిని 27/1 సర్వే నెంబరుపై రికార్డు లో ఎక్కించుకొని వేరే వారికి విక్రయించారన్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో అక్రమార్కులు తమపైకి పోలీసులను ఉసిగోల్పి మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితులు ఆరోపించారు. తమకు న్యాయం జరగకుంటే అంబేద్కర్ చౌరస్తాలో ఆందోళన చేపడ్తామన్నారు.

చర్యలు తీసుకుంటాం

ఈ విషయంపై తాసీల్దార్‌ను వివరణ కోరగా అచ్చంపేట పట్టణంలోని టంగాపూర్ కాలని 26,27 సర్వే నెంబర్‌లోని భూ వివాదంపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్య తీసుకుంటామని తెలిపారు.

- మురళీమోహన్, తాసీల్దార్

గంజాయి పట్టివేత

గంజాయితో పట్టుబడిన వ్యక్తితో పోలీసులు

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 12: జిల్లా కేంద్రంలో శుక్రవారం ఓ యువకుడి నుంచి 30 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు. ఎస్సైకథనం మేరకు విశ్వసనీయ సమాచారం మేరకు మ ధ్యాహ్నం బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహించగా పెద్దకొత్తపల్లికి చెందిన విశ్వస్వరూప్ వద్ద 30 గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించి విచారించగా, హైదరాబాద్ దూల్‌పేట నుంచి తాను సేవించేందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. యువకుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కదిలిన యంత్రాంగం

వంగూరు, ఏప్రిల్ 12 : నమస్తే తెలంగాణ దినపత్రికలో శుక్రవారం ప్రచురించిన ఉమ్మాపూర్‌లో లోపించిన పారిశుధ్యం వార్తకు స్పందించిన పంచాయతీ అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టారు. వాటర్ ట్యాంకు వద్ద నీరు నిల్వడానికి కారణమైన ప్రదేశంలో పైప్‌లైన్ తవ్వి తీసి వాటిలో చెత్త నిండిపోవడంతో వాటిని తొలగించారు. నీరు ఏ మాత్రం నిల్వ వుండటానికి వీలు లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ట్యాంకు వద్ద చేపట్టిన మరమ్మతులు

ఆలయంలో గుప్త నిధుల కోసం తవ్విన దృశ్యం

గుప్తనిధుల కోసం తవ్వకాలు

బల్మూరు, ఏప్రిల్ 12: గుప్త నిధుల కోసం ఆలయంలో తవ్వకాలు జరిపిన ఘటన మండలంలోని కొండనాగుల గ్రామసమీపంలోని పెద్దగుడిబండ రామలింగేశ్వర స్వామి ఆలయంలో చోటు చేసుకున్నది. గ్రామస్తుల వివరాల మేరకు గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు గుప్త నిధుల కోసం ఆలయ మండపంలోని నంది విగ్రహం వద్ద రాళ్లను తొలగించారు. శుక్రవారం ఉదయం ఆలయ పూజారి గమనించి గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరిశీలించారు. నంది విగ్రహం సమీపంలో రాళ్లను తొలగించడంతో పాటు సీసీ కెమెరాల వైర్లు తొలగించి హార్డ్ డిస్క్ తీసుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గతంలో ఆలయంలో దొంగతనాలు, తవ్వకాలు జరిపితే దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా దుండగులు వాటిని కూడా తీసుకెళ్లారన్నారు. దుండగులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు పోలీసులను కోరారు. ఈ ఘటనపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

సీసీ కెమెరాలను కట్ చేసిన దుండగులు

క్రీడాసామగ్రి పంపిణీ

యువకులకు క్రీడాసామగ్రి అందిస్తున్న రాహుల్‌రెడ్డి

అచ్చంపేట రూరల్, ఏప్రిల్ 12 : మండలంలోని కేశ్యాతండాలో శుక్రవారం మన్నేవారిపల్లికి చెందిన తెలంగాణ స్పోర్ట్స్ వైస్‌చైర్మన్ రాహుల్‌రెడ్డి శుక్రవారం యువకులకు వాలీబాల్, క్రికెట్‌కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిన్ననాయక్, పత్యానాయక్ పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి కరపత్రాల విడుదల

అమ్రాబాద్, ఏప్రిల్ 12: పదర మండల కేంద్రంలో శుక్రవారం మాల ఉద్యోగు ల ఐక్య వేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక సభ్యులు మాట్లాడుతూ 14వతేదీన అచ్చంపేటలో నిర్వహించే జయంతి వేడుకలకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నా రు. పదర మండలం నుంచి రథయా త్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాల ఉద్యోగుల ఐక్య వేదిక సభ్యులు నిరంజ న్, శ్రీను, రంజిత్, రాములు, బాలింగం, ఆనంద్ పాల్గొన్నారు.

చిరుత దాడిలో దూడ మృతి

బిజినపల్లి, ఏప్రిల్ 12 : చిరుత దాడిలో లేగదూడ మృతిచెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి సమీపంలో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని కీమ్యాతండాకు చెందిన రైతు పర్షరోజు మాదిరిగానే గురువారం రాత్రి తన పొలంలో పశువులను కట్టేసి ఇంటికెళ్లాడు. శుక్రవారం ఉదయం వెళ్లే సరికి దూడ చనిపోయిందని, చిరుతనే దాడి చేసి చంపినట్లు తెలిపారు. చిరుత వరుస దాడులతో చుట్టుపక్కల తండావాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఫారెస్ట్ అధికారులు స్పందించి చిరుతను పట్టుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 3 తులాల బంగారం, రూ.35 వేల నగదు అపహరణ

క్లూస్ టీంతో ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

పెంట్లవెల్లి, ఏప్రిల్ 12: పట్టపగలు ఇంటి తాళం విరగ్గొట్టి బంగారం, నగదు ఎత్తుకెళ్లిన ఘటన శుక్రవారం పెంట్లవెల్లి మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. ఎస్సై రామన్ గౌడ్ కథనం మేరకు మండల కేంద్రానికి చెందిన తాళ్ల ఎల్లమ్మ రోజు మాదిరి ఉదయం ఇంటికి తాళం వేసి భర్త, కుమారుడితో కలిసి పొలానికి వెళ్లింది. మధ్యాహ్నం పొలం నుంచి రాగా ఇంటి తలుపులు తెరుచుకొని ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగుల గొట్టి అందులో ఉన్న తాలిబొట్టుతో సహా మూడుతులాల బంగారం, రూ.35వేల నగదు చోరీ అయినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చింది. సిబ్బంది, క్లూస్ టీంతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

ప్రేమ విఫలమై.. యువతి ఆత్మహత్య

కోడేరు, ఏప్రిల్ 12 : ప్రేమ విఫలమైందని యువతి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని నాగులపల్లితండాలో చోటుచేసుకున్నది. ఎస్సై కురుమూర్తి కథనం మేరకు.. కోడేరు మండలం నాగులపల్లితండాకు చెందిన జ్యోతి(25) హైదరాబాద్‌లో నర్సింగ్ కోర్స్ శిక్షణ పొందుతున్నది. ఈక్రమంలో నాలుగేళ్లుగా హైదరాబాద్‌కు చెందిన ఓ యువకుడితో ప్రేమలో పడింది. సదరు యువకుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి చివరకు మోసం చేశాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన జ్యోతి శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబీకులు గమనించే సరికే ఆమె మృతి చెందింది. సమాచారం అందుకున్న ఏఎస్సై ఖయ్యూం ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

తిమ్మాజిపేట, ఏప్రిల్ 12: మండల కేంద్రానికి చెందిన యాదిలా ల్(54) అదృశ్యమైనట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. దాదాపు ఎనిమిది నెలలక్రితం ఆయన ఇంటినుంచి వెళ్లి తిరిగి రాకపోవడతో ఎంత వెతికినా ఆచూకీ లభించక పోవడంతో శుక్రవా రం యాదిలాల్ సోదరి హంసాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

వెల్దండ, ఏప్రిల్ 12 : మండలంలోని తిమ్మినోనిపల్లికి చెందిన శివ అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో యెన్నం దవాఖానలో చికిత్స పొందుతున్న శివను బీఆర్ఎస్ నాయకుడు రాజు శుక్రవారం పరామర్శించి రూ.5వేలు అందజేశారు. కార్యక్రమం లో బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు సీపీఐ ఉమ్మడి జిల్లా సమావేశం

కొల్లాపూర్, ఏప్రిల్ 12: కొల్లాపూర్ పట్టణంలో ఆదివారం సీపీఐ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సమితి సభ్యుల సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.బాలనర్సింహ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరవుతున్న ఈ సమావేశానికి ఉమ్మడి పాలమూరు జిల్లా సమితిసభ్యులు అధికసంఖ్యలో తరలిరావాలని పేర్కొన్నారు.

నేడు సామూహిక భగవద్గీత పారాయణం

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 12: జిల్లా కేంద్రం పాతమార్కెట్ ఆవరణలోని శివాలయంలో శనివారం సామూహిక భగవద్గీత పారాయణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే సామూహిక పారాయణంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సమావేశం

కల్వకుర్తి, ఏప్రిల్ 12 : పట్టణంలోని వైఆర్ఎం కాంప్లెక్స్‌లో శనివారం ఉదయం 11గంటలకు బీఆర్ఎస్ నియోజకవర్గస్థా యి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని బీఆర్ఎస్ కల్వకుర్తి అధ్యక్షు డు విజయ్‌గౌడ్ తెలిపారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపుకోసం చేపట్టే అంశాలపై చర్చించేందుకు నిర్వహిస్తున్న సమావేశానికి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ హాజరవుతున్నారని ఆయన చెప్పారు. నియోజకవర్గం నుంచి పార్టీ సమన్వయకర్తలు అధికసంఖ్యలో కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు.

అంబేద్కర్ యువజన సంఘానికి విరాళం

పెంట్లవెల్లి, ఏప్రిల్ 12: మండలంలోని జటప్రోల్ గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పెయింట్ వేసేందుకుగాను గ్రామానికి చెందిన మహానంది రెడ్డి శుక్రవారం అంబేద్కర్ సంఘం యువజన సంఘం నాయకులకు రూ.10వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా మహానందిరెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహం కలర్‌షేడ్ కావడంతో పాటు విగ్రహం చుట్టూ ఉన్న గ్రిల్స్, దిమ్మె శిథిలావస్థకు చేరడంతో వాటి మరమ్మతు కోసం సాయం అందజేశానన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మహానందిరెడ్డిని అభినందిచారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 12: మండలంలోని కొత్తపేట సొసైటీ పరిధిలోని అన్ని గ్రామాల్లో అధికారులు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సింగిల్‌విండో డైరెక్టర్ సాయి ప్రసాదరావు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆయాగ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు వరి ధాన్యం దళారులకు విక్రయించి తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అధికారులు వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ప్రభుత్వ మద్దతు ధర అందేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుంటే రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.

వైభవంగా వెంకన్న కల్యాణోత్సవం

తిమ్మాజిపేట, ఏప్రిల్ 12: మండలంలోని ఆవంచ వేంకటేశ్వరాలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలు అందజేశారు. స్వామివారి కల్యాణోత్సవం తిలకించేందుకు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ ప్రాంగణం గోవిందనామస్మరణతో మార్మోగింది. వేడుకల్లో ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌కుమార్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కాగా ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి దంపతులు ఆవంచలో గణపతి ఆలయాన్ని దర్శించుకుని తీర్థప్రసాదాలు తీసుకున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311823-All

FINANCIAL SERVICES

★రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార రుణం, అతి తక్కువ వడ్డీ రేటుతో, సిబిల్ అవసరం లేదు! NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏజెంట్స్ కావలెను. నొవా ఫైనాన్స్. ఫోన్: 7696660523.
NT-311979_All

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794